క్లుప్తంగా

భార్యా, కుమార్తె అదృశ్యంపై కేసు

పెనమలూరు: యనమలకుదురులో భార్యా, కుమార్తె అదృశ్యమయ్యారని భర్త పోలీసులకు ఫిర్యాదు చేయటంతో శనివారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ వెంకటరమణ తెలిపిన వివరాల ప్రకారం.. యనమల కుదురు డొంకరోడ్డుకు చెందిన తాడంకి నాగేంద్రబాబుకు భార్య యువరాణి, కుమార్తె (6) ఉన్నారు. అతను పటమటలో మ్యారేజీ లైన్స్ లో పని చేస్తాడు. కాగా ఈ నెల 1వ తేదీన నాగేంద్రబాబు పనికి వెళ్లాడు. మధ్యాహ్నం ఇంటికి వచ్చే సరికి భార్య, కుమార్తె ఇంట్లో కనబడలేదు.భార్య యువరాణికి ఫోన్ చేయగా ఫోన్ స్విచ్ఛాఫ్ వచ్చింది. వారి కోసం పలు ప్రాంతాల్లో వెతికినా జాడ తెలియలేదు. దీంతో భర్త నాగేంద్రబాబు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేశారు.

తాగునీరు ప్రాణాధారం



కంకిపాడు: తాగునీరు ప్రాణాధారమని సీఐ జె.మురళీకృష్ణ అన్నారు. కంకిపాడు పోలీసు స్టేషన్ వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని సీఐ మురళీకృష్ణ శనివారం ప్రారంభించారు. ఎండల తీవ్రత పెరుగుతున్న దృష్ట్యా ఇక్కడ ఏర్పాటు చేసిన చలివేంద్రం ప్రజలకు ఉపయుక్తంగాఉంటుందన్నారు. ఎస్ఐ డి.సందీప్, అదనపు ఎస్ఐ డి.తాతాచార్యులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

గన్నవరం: మండలంలోని కేసరపల్లిలో ఎస్సీ కాలనీలో అనారోగ్యంతో బాధపడుతున్న పలువురికి గ్రామ ఉప సర్పంచ్ జాస్తి శ్రీధర్‌బాబు రూ.10 వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఏఎంసీ మాజీ చైర్మన్ పొట్లూరి బసవరావు మాట్లాడుతూ పేద వర్గాల అభ్యున్నతి సాయం అందిస్తున్న శ్రీధర్‌బాబును ఆయన అభినందించారు. ఎంపీటీసీ సభ్యులు కొంతి కిషోర్, వార్డు సభ్యులు రత్తయ్య, మాజీ ఎంపీటీసీ మరీదు రాంబాబు, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గ్రాడ్యుయేషన్ డే

గన్నవరం: స్థానిక విద్యానగర్‌లోని నారాయణ స్కూల్‌లో ప్రైమరీ విద్యార్థుల గ్రాడ్యుయేషన్ డే శనివారం ఘనంగా నిర్వహించారు. పాఠశాలలో ఐదో తరగతి పూర్తిచేసుకుని ఆరులోకి అడుగుపెడుతున్న విద్యార్థులకు సీనియర్ న్యాయవాది కలపాల వెంకటరమణ గ్రాడ్యుయేషన్ పట్టాలను అందజేశారు. ప్రిన్సిపాల్ బాషా అధ్యక్షతన ఏజీఎం సత్తిరెడ్డి, జోనల్ కోఆర్డినేటర్ లియోని, వైస్ ప్రిన్సిపాల్స్ శిరీష, అనూష, నవీనా తదితరులు పాల్గొన్నారు.

రామవరప్పాడు: విద్యార్థులకు ప్రాథమిక స్థాయి నుంచే నాయకత్వ లక్షణాలు అలవడే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలని ఆక్స్‌ఫర్డ్ స్కూల్ రీజనల్ ఇన్‌చార్జి తోటా ఉమారాణి అన్నారు. విజయవాడరూరల్ మండలం రామవరప్పాడులోని గుంటూరు ఆక్స్‌ఫర్డ్ స్కూల్‌లో శనివారం స్నాతకోత్సవం ఘనంగా నిర్వహించారు. యూకేజీ విద్యార్థులకు సర్టిఫికెట్లను అందజేశారు. ప్రిన్సిపాల్ పద్మవాణి మాట్లాడారు. విద్యార్థుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

కతోలిక విశ్వాసుల పాదయాత్ర

కేసరపల్లి(గన్నవరం): ప్రపంచ శాంతిని కాంక్షిస్తూ పవిత్ర తపస్సు కాలంలో కేసరపల్లిలోని పునీత అంతోని దేవాలయ విచారణకు చెందిన కతోలిక విశ్వాసులు శనివారం గుణదల లూర్దు మాత పుణ్యక్షేత్రానికి పాదయాత్ర నిర్వహించారు.విచారణ కర్తలు రెవ.ఫాదర్ నూతలపాటి కిషోర్ నేతృత్వంలో 300 మంది భక్తులు కేసరపల్లిలో పాదయాత్రగా బయలుదేరి గుణదల పుణ్యక్షేత్రానికి చేరుకున్నారు. విచారణ కర్తలు ఫాదర్ కిషోర్ ప్రపంచ శాంతి కోసం దివ్యబలిపూజ సమర్పించారు. పెద్దలు, మరియమాత దళం, యూత్ సభ్యులు పాల్గొన్నారు.

అంకితభావంతో పనిచేస్తే గుర్తింపు

గన్నవరం: వృత్తి పట్ల అంకితభావంతో పని చేసే ఉపాధ్యాయులకు సమాజంలో మంచి గుర్తింపు లభిస్తుందని మాజీ ఎమ్మెల్సీ కేఎస్.లక్ష్మణరావు తెలిపారు. ఆత్కూరు జెడ్పీ హైస్కూల్‌లో ఉపాధ్యాయురాలిగా పనిచేసి ఉద్యోగ విరమణ చేసిన యు. ఉమామహేశ్వరీదేవికి శనివారం స్థానిక రాయ్‌నగర్ కల్యాణ మండపంలో అభినందన సభ నిర్వహించారు. ఉమామహేశ్వరీదేవి దంపతులను సత్కరించారు. మాజీ ఎమ్మెల్సీ బొడ్డు నాగేశ్వరరావు, యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఉమామహేశ్వరరావు, లెనిన్‌బాబు, కోశాధికారి మరీదు వరప్రసాద్, ఎంఈఓ సాంబశివరావు, గన్నె వెంకట్రావు, కర్రా వరప్రసాద్ పాల్గొన్నారు.

రామాలయానికి వితరణ



పెనమలూరు: తాడిగడపలో శ్రీనివాసానగర్ కాలువ కట్టపై ఉన్న శ్రీ కోదండ రామాలయానికి పెనమలూరు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త దేవభక్తుని చక్రవర్తి ఆర్థిక సాయం అందించారు. శనివారం తాడిగడప మున్సిపాలిటీ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వేమూరి బాలకృష్ణ శ్రీరామనవమి పండుగకు రూ.10 వేలు కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నేతలు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలంలో పచ్చ నేత దందా



ఆక్రమించిన స్థలంలో ఏర్పాటు చేసిన షెడ్లు, హోర్డింగ్

గన్నవరం: ప్రభుత్వ స్థలాన్ని యథేచ్ఛగా ఆక్రమించుకోవడంతో పాటు వ్యాపార దుకాణాలకు, యాడ్స్ ఏజెన్సీలకు అద్దెకు ఇస్తూ ఓ టీడీపీ నేత లక్షల రూపాయలు వసూలు చేస్తున్నాడు. ఇదేమని ఎవరైనా ప్రశ్నిస్తే మాత్రం తాను ఎమ్మెల్యే మనిషినంటూ బెదిరింపులకు పాల్పడుతున్నాడు. ఇతను చేసే హడావుడి చూసి అధికారులు కూడా చూసీచూడనట్లు వదిలేస్తున్నారు. దీంతో సదరు అధికార పార్టీ నేత ఆగడాలకు అడ్డూఅదుపూ లేకుండా పోయింది. ఆక్రమించిన స్థలంలో షెడ్లు నిర్మాణం చేస్తూ చివరికి ఆర్అండ్‌బీ రహదారిని కూడా కబళించేస్తున్నాడు. వివరాలిలా ఉన్నాయి. కేసరపల్లిలో జాతీయ రహదారి, ఆర్అండ్‌బీ రోడ్డు మధ్యలో ఉన్న ప్రభుత్వ స్థలంలో శ్రీ వీరాంజనేయస్వామి, సాయిబాబా ఆలయాలను గతంలో మల్లంపాటి బాబూరావు నిర్మించారు. దేవాలయాలు కావడంతో అప్పట్లో అధికారులు కూడా ఈ ఆక్రమణల జోలికి రాలేదు. బాబూరావు మరణం తర్వాత టీడీపీ నేత గుడి వ్యవహారాలను చూస్తున్నాడు. ఆక్రమించిన ఆర్అండ్‌బీ రహదారి స్థలంలో కొత్తగా షెడ్లు నిర్మించి టైర్లదుకాణానికి అద్దెకు ఇవ్వడంతో పాటు మరో బడ్డీ కొట్టును ఏర్పాటు చేయించాడు. అద్దెల పేరుతో దుకాణదారుల నుంచి నెలకు రూ.12 వేల వరకు వసూలు చేస్తున్నాడు. అంతే కాకుండా సదరు స్థలంలో ఏర్పాటు చేసిన భారీ హోర్డింగ్‌కు సంబంధించి యాడ్స్ ఏజెన్సీ సంస్థ నుంచి ఏడాదికి రూ.3.70 లక్షలు వసూలు చేస్తున్నారని విశ్వసనీయ సమాచారం. ఈ అక్రమ కట్టడాలపై చర్యలు తీసుకోవడంతో పాటు ప్రభుత్వ స్థలంలో ఉన్న యాడ్ హోర్డింగ్‌కి సంబంధించి లీజు డబ్బులను గ్రామ పంచాయతీకి జమ చేయాలని కొంత మంది గ్రామస్తులు పంచాయతీ కార్యదర్శికి విజ్ఞప్తి చేశారు. అయితే ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు సొంత మనిషినంటూ చెప్పుకుంటున్న ఆ వ్యక్తి తన అక్రమ కట్టడాలపై అధికారులు చర్యలు తీసుకోకుండా కట్టడి చేస్తున్నాడు. ఆక్రమణ నిర్మాణాల జోలికి వెళ్లవద్దని స్వయంగా ఎమ్మెల్యే ఆఫీస్ నుంచి ఒత్తిడి తెస్తున్నట్లు ఓ అధికారి చెబుతుండడం గమనర్హం. అవినీతి, అక్రమాలను ప్రోత్సహించనని పదేపదే చెబుతున్న యార్లగడ్డ ఇటువంటి వ్యక్తులను ఎందుకు వెనకేసుకొస్తున్నారని ఆ పార్టీ నేతలే ప్రశ్నిస్తున్నారు.

ఫిర్యాదును పరిశీలిస్తున్నాం..

అక్రమ కట్టడాలు చేస్తున్నట్లుగా గ్రామస్తుల నుంచి ఫిర్యాదు అందింది. దీనిపై విచారణ జరుపుతున్నాం. సదరు ఆక్రమణకు గురైన స్థలం ఆర్అండ్‌బీ శాఖ పరిధిలో ఉంది. గతంలోనే సదరు స్థలం ఆక్రమణకు గురై ఆలయం నిర్మించారు. ఆలయం వెనుక వైపు టైర్ల దుకాణం, బడ్డీకొట్టును ఏర్పాటు చేశారు.

– ప్రసాద్, ఈఈ, కేసరపల్లి

విద్యార్థులు క్రీడాస్ఫూర్తితో మెలగాలి



కంకిపాడు: విద్యార్థులు క్రీడా స్ఫూర్తితో మెలగాలని ఎస్ఐ డి.సందీప్ సూచించారు. పునాదిపాడు శ్రీచైతన్య విద్యాసంస్థల్లో జోనల్ స్థాయి ఆటల పోటీలు శనివారం నిర్వహించారు. ఈ పోటీలను ఎస్ఐ డి.సందీప్ క్రీడాజ్యోతి వెలిగించి ప్రారంభించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఎస్ఐ మాట్లాడుతూ ఆసక్తి గల రంగాలను ఎంచుకుని ప్రతిభ చాటాలన్నారు. తమలో దాగి ఉన్న నైపుణ్యతను వెలికితీయాలని, ఉన్నత విలువలతో సమాజంలోకి రావాలని సూచించారు. క్రమశిక్షణ, పట్టుదలతో ఉన్నత స్థాయికి చేరుకోవటం సాధ్యమవుతుందని వివరించారు. కార్యక్రమంలో విద్యాసంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఘనంగా బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి



కానూరులో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నేత దేవభక్తుని చక్రవర్తి, అన్నే, తదితరులు



గన్నవరంలో జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న దళిత సంఘాల నేతలు

గన్నవరం: పెనమలూరు, గన్నవరం నియోజకవర్గాల్లో మాజీ ఉపప్రధాని బాబూజగ్జీవన్‌రామ్ జయంతిని శనివారం ఘనంగా నిర్వహించారు. గన్నవరంలో సుందరయ్య పార్కు వద్ద దళిత సంఘాల ఆధ్వర్యంలో జగ్జీవన్‌రామ్ విగ్రహానికి ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాచేటి మురళి, ఎంఈఎఫ్ రాష్ట్ర నేత దేవరపల్లి విక్టర్‌బాబు, వైఎస్సార్ సీపీ క్రిస్టియన్ సెల్ జిల్లా అధ్యక్షుడు పోలిమెట్ల జయరాజు నివాళులర్పించారు. కేక్‌ను సర్పంచి నిడమర్తి సౌజన్య కట్‌చేశారు. వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కేవీఆర్. కిషోర్, గౌరవాధ్యక్షులు తిరివీధి వెంకయ్య నేతృత్వంలో వాకర్స్ జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద పుష్పాంజలి ఘటించారు. ఆర్టీసీ బస్టాండ్‌లో ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జయంతి వేడుకలు జరిపారు. అంకం చిట్టిబాబు, దుర్గారావు, ఎంఏఫ్.శ్రీనివాసరావు, టీఐ మాణిక్యాలరావు పాల్గొన్నారు.

ఉయ్యూరు: జగ్జీవన్‌రామ్ యూత్ ఆధ్వర్యంలో మాజీ ఉప ప్రధాని జగ్జీవన్‌రామ్ జయంతిని నిర్వహించారు. మాజీ ఎమ్మెల్సీ వైవీబీ రాజేంద్రప్రసాద్ జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఉయ్యూరు దళితవాడలో జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద జయంతి నిర్వహించారు.



రామవరప్పాడు రింగ్ సెంటర్‌లో..

నున్నలో జగ్జీవన్‌రామ్ విగ్రహావిష్కరణ

నున్న(విజయవాడరూరల్):స్థానికంగా నూతనంగా ఏర్పాటు చేసిన డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహావిష్కరణ శనివారం జరిగింది. జగ్జీవన్‌రామ్ జయంతి సందర్భంగా గ్రామ ఉపసర్పంచి కలకోటి బ్రహ్మానందరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు జూనపూడి కృష్ణ, కలపాల అబ్రహాం, మాజీ ఎంపీటీసీ తానంకి రాజారావు, టీడీపీ నాయకులు పోలారెడ్డి సాంబిరెడ్డి, ప్రత్తిపాటి సుందరయ్య, కాటూరి శ్రీనివాసరావు, ఎమ్మార్పీఎస్ నేతలు మందా వేణు, మున్నంగి రాజు, నిరంజన్, తదితరులు నివాళులర్పించారు. బ్యాంక్ సెంటర్లో డాక్టర్ జగ్జీవన్‌రామ్ చిత్రపటాకిని నివాళులర్పించారు. తగరం రవీంద్ర, కాటూరి నాగరాజు, కొర్నిపాటి రంగారావు, తగరం చంటి, బొకినాల తిరుపతిరావు పాల్గొన్నారు.



కంకిపాడు బస్టాండు సెంటరులో..



యనమలకుదురులో జగ్జీవన్‌రామ్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న వెంకటేశ్వరరావు మాదిగ

పెనమలూరు: యనమలకుదురు బీజేఆర్‌యూత్ ఆధ్వర్యంలో శనివారం మాజీ ఉప ప్రధానమంత్రి బాబూజగ్జీవన్‌రామ్ విగ్రహా నికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్రఅధ్యక్షుడు పి.వెంకటేశ్వరరావు మాదగి, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు పులిపాక ప్రవీణ్, బీజేఆర్ యూత్‌కమిటీ సభ్యులు శేషయ్య, భార్గవ్, పి.శ్రావణ్, ఎద్దు సామ్రాజ్యం, జి.రమ పాల్గొన్నారు.

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం పలు గ్రామాల్లో శనివారం మాజీ ఉపప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ జయంతిని ఘనంగా నిర్వహించారు. రామవరప్పాడు రింగ్‌లోని జగ్జీవన్‌రామ్ విగ్రహానికి జెడ్పీటీసీ సభ్యుడు కాకర్లమూడి సువర్ణరాజు, నిడమానూరు నెహ్రూనగర్‌లోని విగ్రహానికి సర్పంచ్ శీలం రంగారావు తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమాల్లో వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

ఉంగుటూరు(గన్నవర): మండలంలోని పెద్దఆవుటపల్లి గ్రామంలో దళిత సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో బాబూజగ్జీవన్‌రామ్ జయంతిని శనివారం నిర్వహించారు. ఆయన విగ్రహానికి డీఎస్ఎస్ నియోజకవర్గ అధ్యక్షుడు దేవరపల్లి బుజ్జిబాబు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సంఘ నేతలు సుదీర్, బాబూరావు, గ్రామస్తులు కొండలరావు, కిట్టయ్య, షడ్రక్, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

కంకిపాడు: పీడిత ప్రజల ఆశాజ్యోతి బాబూ జగ్జీవన్ రామ్ అని వైఎస్సార్ సీపీ పెనమలూరు నియోజకవర్గ సమన్వయకర్త దేవభక్తుని చక్రవర్తి అన్నారు. భారత మాజీ ఉపప్రధాని, స్వాతంత్ర్య సమరయోధుడు బాబూ జగ్జీవన్‌రామ్ జయంతిని పలు గ్రామాల్లో శనివారం ఘనంగా నిర్వహించారు. కుందేరు గ్రామంలోని జగ్జీవన్‌రామ్ విగ్రహానికి దేవభక్తుని చక్రవర్తి పూలమాల వేసి నివాళులర్పించారు. పార్టీ మండల అధ్యక్షురాలు మాదు శ్రీహరిరాణి, జెడ్పీటీసీ సభ్యుడు బాకీ బాబు, నందిపాటి బిందు మాధవి, పిడికిటి రామకోటేశ్వరరావు, కందలంపాడు సర్పంచ్ బాయిరెడ్డి నాగరాజు, కలకోట ప్రసాద్‌రెడ్డి, బందెల సుబ్బారావు, కలపాల వజ్రాలు, దిరిశం ఇందిరా ప్రియదర్శిని, చోరగుడి శ్రీకాంత్ పాల్గొన్నారు. గొడవర్రు గ్రామంలో ఎంపీటీసీ సభ్యురాలు చుండూరు నిర్మలజ్యోతి, చుండూరు మోహన్‌రావు, ముక్కు అవినాష్, స్థానిక నేతలు పాల్గొన్నారు.

- ఎంఈఎఫ్ ఆధ్వర్యంలో జయంతి నిర్వహించారు. మధునాగుల మనోహర్, కుంపటి రాజేంద్రప్రసాద్, గాలంకి జయరాజు, పీకా ఇమ్మానుయేలు, ఐ.నాగేశ్వరరావు, యు.టైటస్‌పాల్, ఎంఎస్ రాజు తదితరులు పాల్గొన్నారు.
- ఎస్సీ, ఎస్టీ హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో గొడవర్రు గ్రామ కూడలిలో జయంతి నిర్వహించారు. సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు ఇంటూరి ఏలియా, ఉయ్యాల ఏడుకొండలు, సీహెచ్ రాజేంద్రబాబు, ఇంటూరి వేణు, కుంపటి చిన్ని, కుంభా రవి చందర్, కె.చిట్టిబాబు పాల్గొన్నారు.



గొడవర్రులో వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో..

- ఫ్యాప్టో ఆధ్వర్యంలో కంకిపాడు బస్టాండు, గొడవర్రు నిర్వహించారు. ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు పీకా ఇమ్మానుయేలు, రాష్ట్ర కౌన్సిలర్ యు.టైటస్‌పాల్, టీచర్స్ సొసైటీ అధ్యక్షుడు ఐ.నాగేశ్వరరావు, ఫ్యాప్టో సెక్రటరీ కె.రాజేంద్రప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.
- దళిత సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కుందేరులో జయంతి నిర్వహించారు. సంఘం ఉమ్మడి కృష్ణా జిల్లా అధ్యక్షుడు పాతూరిచంద్రశేఖర్, నాయకులు రావెళ్ల సంపత్, దేవరపల్లికోటేశ్వరరావు, పా తూరి శరత్, దేవరపల్లి నక్షత్రకుమార్, వల్లూరి ఏసురత్నం పాల్గొన్నారు.

పెనమలూరు: కానూరు దళితవాడలో శనివారం బాబూజగ్జీవన్‌రామ్ జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి వైఎస్సార్ సీపీ పెనమలూరు నియోజకవర్గ సమన్వయకర్త దేవభక్తుని చక్రవర్తి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. చక్రవర్తి మాట్లాడుతూ బహుజనుల హక్కుల కోసం జగ్జీవన్‌రామ్ చేసిన పోరాటాన్ని స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి అన్నే వేణుగోపాలకృష్ణమూర్తి(చిట్టిబాబు) మాట్లాడుతూ దళితులకు సమాజంలో గుర్తింపు లభించే విధంగా జగ్జీవన్‌రామ్ పోరాటం చేశారన్నారు. నేతలు శీలంశ్రీరాములు, బకినాల అజరయ్య, శాంతిరాజు,పలువురు దళిత నాయకులు పాల్గొన్నారు.


బడుగువర్గాల ఆశాజ్యోతి..



హనుమాన్‌జంక్షన్‌లో జగ్జీవన్ రామ్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న జెడ్పీటీసీ, ఎంపీపీ

హనుమాన్‌జంక్షన్ రూరల్: దివంగత ఉప ప్రధాని బాబూజగ్జీవన్ రామ్ జయంతిని శనివారం హనుమాన్‌జంక్షన్‌లో ఘనంగా నిర్వహించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం ప్రాంగణంలో జగ్జీవన్ రామ్ విగ్రహానికి జెడ్పీటీసీ సభ్యురాలు కొమరవల్లి గంగాభవాని, ఎంపీపీ యర్రగొర్ల నగేష్, ఎంపీటీసీ సభ్యుడు పడకల కోటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ నాయకుడు థామస్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో హనుమాన్‌జంక్షన్ ప్రధాన రహదారుల్లో యువత భారీ ర్యాలీ నిర్వహించారు. ఐనంపూడి ఆశీర్వాదం మాట్లాడారు. స్థానిక ఆర్టీసీ బస్టాండ్ వద్ద దళిత సంఘాల ఆధ్వర్యంలో జగ్జీవన్ రామ్ జయంతి నిర్వహించారు. రాష్ట్ర మాల కార్పొరేషన్ డైరెక్టర్ దయాల రాజేశ్వరరావు, చలమలశెట్టి రమేష్‌బాబు, మాజీ ఎంపీపీ నిమ్మకూరి కిరణ్‌కుమార్, పలువురు టీడీపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు. శ్రవంతి ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో చిరు వ్యాపారులకు తోపుడు బండ్లు, బడ్డీలు, టిఫిన్ బండ్లు ఉచితంగా పంపిణీ చేశారు. ట్రస్ట్ చైర్మన్ వీరమాచినేని సత్యప్రసాద్, ఆయన సతీమణి శ్రీదేవి చేతుల మీదుగా పేద దివ్యాంగులకు వీల్ చైర్ అందించారు. కాకులపాడు డీసీ చైర్మన్ కొమ్మారెడ్డి రాజేష్, మాజీ సర్పంచ్ కడగల శ్రీనివాస్, అభయాంజనేయ స్వామి దేవస్థానం పాలకమండలి మాజీ సభ్యుడు మేడేపూడి రామ్మోహన్ రావు పాల్గొన్నారు.

మొక్కజొన్న మిషన్‌లో పడి మహిళ దుర్మరణం



మొక్కజొన్న మిషన్‌లో పడిన మహిళ దేహం

పెనమలూరు: చోడవరం గ్రామంలో మొక్కజొన్న మిషన్‌లో శనివారం ప్రమాదవశాత్తు మహిళ పడి దుర్మరణం చెందింది. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం తోట్లవల్లూరు మండలం వల్లూరుపాలెంకు చెందిన తుమ్మలజ్యోతి(30) సహచర కూలీలతో కలిసి చోడవరం గ్రామానికి మొక్కజొన్న గింజలు ఒలిచే పనులకు వచ్చింది. వారు ఉదయం నుంచి మిషన్ యజమాని శ్రీనివాసరావుతో కలిసి చోడవరం నాగేంద్రస్వామివారి ఆలయ సమీపంలో కౌలు రైతుకు చెందిన పొలంలో మొక్కజొన్న కండెలను మిషన్‌లో వేస్తూ పనులు చేశారు. సాయంత్రం ఒక్కసారిగా వాతావరణం మారి ఈదురుగాలి రావటంతో మొక్కజొన్న పంట వద్ద ఉన్న టార్పాలిన్ పట్టా గాలికి ఎగరటంతో జ్యోతి పట్టాను పట్టుకోవటానికి యత్నించగా ఆమె చీర మిషన్‌కు చుట్టుకుని ప్రమాదవశాత్తు మొక్కజొన్న మిషన్‌లో పడింది. మిషన్ తిరుగుతుండటంతో జ్యోతి మిషన్‌లోనికి సగభాగం వెళ్లింది. ఆమె తల ముక్కలైంది. అక్కడే ఉన్న ఇతర కూలీలు మెషిన్‌ను ఆపారు. అప్పటికే శరీరం నుజ్జుకావటంతో మృతి చెందింది.ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.

అండగా ఉంటా.. ధైర్యంగా ఉండండి



జాన్ దేవిడ్ కుటుంబాన్ని పరామర్శిస్తున్న వైఎస్సార్ సీపీ నేత దేవభక్తుని చక్రవర్తి

కంకిపాడు: పార్టీ కార్యకర్తలకు, బాధిత కుటుంబాలకు ఎల్లప్పుడూ అండగా ఉంటానని, ధైర్యంగా ఉండాలని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త దేవభక్తుని చక్రవర్తి భరోసా ఇచ్చారు. మండలంలోని కుందేరు గ్రామానికి చెందిన దేవరపల్లి జాన్‌డేవిడ్ ఇటీవల మృతి చెందటంతో బాధిత కుటుంబాన్ని శనివారం ఆయన పరామర్శించారు. జాన్‌డేవిడ్ మృతికి గల కారణాలు అడిగి తెలుసుకుని కుటుంబాన్ని ఓదార్చారు. తన వంతుగా రూ.10 వేలు ఆర్థిక సాయం అందించారు. పార్టీ అండగా ఉంటుందని ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు బాకీ బాబు, పార్టీ మండల అధ్యక్షురాలు మాదు శ్రీహరిరాణి, మహిళా విభాగం నియోజకవర్గ అధ్యక్షురాలు నందిపాటి బిందుమాధవి, మేథావుల విభాగం అధ్యక్షుడు పిడికిటి రామకోటేశ్వరరావు, స్థానిక నాయకులు కలకోట ప్రసాద్‌రెడ్డి, కె.సురేష్ తదితరులు పాల్గొన్నారు.

నర్సింగ్ విద్య ఉన్నతమైనది

ఏపీఎన్ఎంసీ రిజిస్ట్రార్ సుశీల



ల్యాంప్ లైటింగ్‌లో నర్సింగ్ విద్యార్థినులు

గన్నవరం రూరల్: నర్సింగ్ విద్య ఉన్నతమైనదని ఏపీఎన్ఎంసీ రిజిస్ట్రార్ కె.సుశీల అన్నారు. మండలంలోని చిన అవుటపల్లి డాక్టర్ సి.శోభనాద్రి సిద్ధార్థ నర్సింగ్ కళాశాల, స్కూల్ ఆఫ్ నర్సింగ్‌లో శనివారం జరిగిన ల్యాంప్ లైటింగ్ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రిన్సిపాల్ జె.వందన అధ్యక్షతన జరిగిన సభలో సుశీల మాట్లాడుతూ 1853లో జరిగిన రెండవ ప్రపంచ యుద్ధంలో క్షతగాత్రులకు వైద్య సేవలందించి ఎంతో మంది ప్రాణాలు కాపాడిన నైటింగేల్ ఆదర్శం కావాలన్నారు. మెడికల్ కళాశాల డైరెక్టర్ జనరల్ డాక్టర్ చదలవాడ నాగేశ్వరరావు మాట్లాడుతూ రోగులకు చిరునవ్వుతో సేవలందించాలన్నారు. నర్సింగ్ కళాశాల కన్వీనర్ డాక్టర్ ఎస్.రాజగోపాల్ మాట్లాడుతూ ప్రపంచంలో ఎంతో డిమాండ్ ఉన్న కోర్సు నర్సింగ్ అని చెప్పారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవీ భీమేశ్వర్, మెడికల్ డెప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ కళ్యాణి, నర్సింగ్ స్కూల్ ప్రిన్సిపాల్ బి.కళ్యాణి, డాక్టర్ రవికుమార్, అధ్యాపకులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పాడి రైతులకు రూ.2.13 కోట్ల బోనస్ పంపిణీ



పాల సొసైటీ అధ్యక్షులకు బోనస్ చెక్కులు అందజేస్తున్న చైర్మన్ చలసాని

హనుమాన్‌జంక్షన్ రూరల్: పాడిరైతుల సంక్షేమమే ధ్యేయంగా కృష్ణా మిల్క్ యూనియన్ పని చేస్తుందని ఆ సంస్థ చైర్మన్ చలసాని ఆంజనేయులు అన్నారు. హనుమాన్‌జంక్షన్ క్లస్టర్ పరిధిలోని 125 పాల సొసైటీలకు 2024– 25 ఆర్థిక సంవత్సరానికి గాను నాల్గోవిడత బోనస్‌గా రూ.2.13 కోట్లను శనివారం ఆయన పంపిణీ చేశారు. స్థానిక విజయవాడరోడ్డులోని కాకాని వెంకటరత్నం పాలఉత్పత్తిదారుల సమావేశం హాల్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో చలసాని మాట్లాడుతూ కృష్ణా మిల్క్ యూనియన్ అత్యధిక పాల సేకరణ ధరను చెల్లించటంతో పాటుగా, ఏడాదికి నాలుగు సార్లు బోనస్‌ను కూడా పాడిరైతులకు అందిస్తుందని పేర్కొన్నారు. ఆయా పాల సొసైటీ అధ్యక్షులకు బోనస్ చెక్కులను అందజేశారు. యూనియన్ పాలకవర్గ సభ్యురాలు శనగల శివజ్యోతి, ఏజీఎం చల్లా అన్వేష్ కుమార్, క్లస్టర్ మేనేజర్ మాగంటి హరిబాబు పాల్గొన్నారు.

డ్రైనేజీ పరిశీలన

కంకిపాడు: బస్టాండు కూడలిలో ప్రమాదకరంగా, రాకపోకలకు అవరోధంగా మారిన డ్రైనేజీని పోలీసులు, పంచాయతీ అధికారులు శనివారం సంయుక్తంగా పరిశీలించారు. బస్టాండులోకి వచ్చిపోయే బస్సులు ప్రధానరహదారి వెంబడి డ్రైన్లకు అనుసంధానంగా ఉన్న మెయిన్ డ్రైయిన్ శిథిలమై ప్రమాదకరంగా మారింది. డ్రైయినుపై ఇనుప గ్రిల్ ధ్వంసం కావటంతో రాకపోకలు సజావుగా సాగటం లేదు. దీంతో తరచూ ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. దీనిపై స్పందించిన ఎస్ఐ డి.సందీప్, పంచాయతీ కార్యదర్శి సాంబశివరావు డ్రైయినేజీ ప్రాంతాన్ని పరిశీలించారు. ధ్వంసమైన ఇనుప గ్రిల్ స్థానంలో నూతనంగా పటిష్టమైన గ్రిల్ ఏర్పాటు చేయటంతో పాటుగా రాకపోకలు సజావుగా సాగేలా చర్యలు తీసుకునేందుకు నిర్ణయించారు.

